క్లుప్తంగా

మెరుగైన ఫలితాలు రావాలి



రికార్డులను పరిశీలిస్తున్న ప్యానల్ ఇన్‌స్పెక్షన్ టీం సభ్యురాలు సునంద

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు వచ్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ప్యానల్ ఇన్‌స్పెక్షన్ టీం సభ్యురాలు సునంద అన్నారు. బుధవారం శివ్వంపేట జెడ్పీ పాఠశాలలో 'ఉన్నతి లక్ష్య' అమలు తీరుని పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులు, బోధన, విద్యార్థుల ప్రగతిని సమీక్షించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలచంద్రం ఉన్నారు.

22న మండల సర్వసభ్య సమావేశం

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం మండల సర్వసభ్య సమావేశం ఈనెల 22వ తేదీన జరుగుతుందని ఎంపీడీఓ శంకర్ బుధవారం తెలిపారు. సమావేశానికి ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన వహిస్తారన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఐకేపీ సమావేశ మందిరంలో జరిగే సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

ఇంటి పన్ను వసూలు



శివ్వంపేటలో ఇంటి పన్ను వసూలు చేస్తున్న కార్యదర్శులు

శివ్వంపేట(నర్సాపూర్): బృందాలుగా ఏర్పడి పంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్ను వసూలు చేస్తున్నారు. ఇంటి పన్ను వసూలు చేయాలని ఉన్నతధికారులు ఆదేశించడంతో అందుకు అనుగుణంగా సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. మైనర్ పంచాయతీల్లో పన్ను వసూలు పూర్తి కావడంతో మేజర్ పంచాయతీల్లో బకాయి వసూలు చేసేందుకు కార్యదర్శులు బృందాలుగా ఏర్పడి వసూలు చేస్తున్నారు. బుధవారం శివ్వంపేటలో ఇంటింటికి వెళ్లి బకాయి వసూలు చేపట్టారు. మండల వ్యాప్తంగా రూ.64 లక్షలు లక్ష్యం ఉండగా ఇప్పటి వరకు 68 శాతం వసూలైనట్లు ఎంపీఓ తిరుపతిరెడ్డి తెలిపారు.

అర్హులకు కేంద్ర పథకాలు అందాలి



ఫైజాబాద్‌లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): అర్హులకు కేంద్ర ప్రభుత్వ పథకాలు అందించడమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్యమని ఆయా శాఖల అధికారులు అన్నారు. బుధవారం చిలప్‌చెడ్ మండలం అజ్జమర్రి, ఫైజాబాద్ గ్రామాలలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడారు. గ్రామీణ ప్రజలకు కేంద్రం అందిస్తున్న ఆయుష్మాన్ భారత్, ముద్ర రుణాలు, ఈజీఎస్, పీఎం కిసాన్ యోజన, పీఎం సురక్ష యోజన, అటల్ పెన్షన్ యోజన, ఉజ్వల గ్యాస్ తదితర పథకాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మనోహర, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఏఈఓ భూపాల్, ఈసీ భగవాన్, అంగన్‌వాడీ టీచర్ శశికళ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలలో పనులు వేగవంతం చేయాలి



చిలప్‌చెడ్‌లో కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శశిప్రభ

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల వ్యాప్తంగా ఉన్న నర్సరీలలో మొక్కల పెంపకం పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ శశిప్రభ ఆదేశించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నర్సరీలలో కవర్లలో మట్టి మాత్రమే నింపారని, త్వరగా విత్తనాలు తెప్పించి వాటిని నాటించాలన్నారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా పాడైన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రమేష్, ఏపీఓ శ్యాంకుమార్, ఈసీ భగవాన్ పాల్గొన్నారు.

దాతల సహకారంతో వాటర్ ప్లాంట్

- రూ.5లకే 20 లీటర్ల ఫిల్టర్ వాటర్
- పరిశుభ్రమైన నీటితో వ్యాధులు దూరం
- సద్వినియోగం చేసుకోవాలన్న ప్రజాప్రతినిధులు



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దాతలు, గ్రామ సర్పంచ్ (ఫైల్)

నర్సాపూర్ రూరల్: దాతల సహకారంతో మండలంలోని కాగజ్ మద్దూరులో వాటర్ ఫిల్టర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు గ్రామ సర్పంచ్ శివకుమార్ బుధవారం తెలిపారు. బాలవికాస నీటి శుద్ధీకరణ పథకంలో భాగంగా బాలవికాస సంస్థ, సోలార్ ప్యాక్ నిర్వాహకుల సహకారంతో వెయ్యి లీటర్ల సామర్థ్యంగల ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఇందుకు రూ.5 లక్షల వరకు వెచ్చించామన్నారు. ఈనెల 18వ తేదీన బాలవికాస సంస్థ, సోలార్ ప్యాక్ ప్రతినిధులు రామచంద్రారెడ్డి, ప్రతాప్ రెడ్డి వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. రూ 5కే 20 లీటర్ల తాగునీటిని అందిస్తున్నట్లు తెలిపారు. పరిశుభ్రమైన తాగునీటితో ఆరోగ్యంగా ఉంటామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉపసర్పంచ్ కిషన్, వార్డుసభ్యులు సూచించారు.

ప్రతీ కుటుంబానికి స్వచ్ఛమైన తాగునీరు



కాగజ్ మద్దూర్ గ్రామస్తుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతీ కుటుంబానికి స్వచ్ఛమైన తాగనీరు అందించాలనే లక్ష్యంతో గ్రామంలో ఫిల్టర్ వాటర్ ప్లాంటును ఏర్పాటు చేయడం అభినందనీయం. గ్రామస్తులు పరిశుభ్రమైన నీరు తాగాలి.

– శివకుమార్, గ్రామ సర్పంచ్, కాగజ్ మద్దూర్

రుణపడి ఉంటాం



రూ.5లకే 20 లీటర్ల ఫిల్టర్ వాటర్‌ను మా గ్రామస్తులకు అందిస్తున్న దాతలకు రుణపడి ఉంటాం. గత కొన్నేళ్లుగా ఫిల్టర్ వాటర్ కోసం ఎదురుచూశాం. మా గ్రామ సమస్య పరిష్కారమైంది. ప్రస్తుతం సరఫరా అయ్యే తాగు నీటితో ఇబ్బందులు పడ్డాం.

– హరిత, గ్రామస్తురాలు

తల్లిదండ్రుల చేతిలో పిల్లల భవిష్యత్



పోషకుల సమావేశానికి హాజరైన తల్లిదండ్రులు, లెక్చరర్లు

ప్రిన్సిపాల్ నర్సింహులు

పాపన్నపేట(మెదక్): పిల్లల భవిష్యత్తు తల్లిదండ్రుల చేతుల్లోనే ఉందని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహులు అన్నారు. బుధవారం పాపన్నపేట లో జరిగిన పోషకుల సమావేశంలో మాట్లాడారు. మార్చిలో ఇంటర్ పరీక్షలు జరగబోతున్న నేపథ్యంలో పిల్లల చదువులపై తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. రోజూ విద్యార్థులు కళాశాలకు వచ్చేలా చూడాలన్నారు. తల్లిదండ్రుల సూచనలు, సలహా లు పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పోషకులు, లెక్చరర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా బంద్

పాపన్నపేట(మెదక్): మిన్‌పూర్ సబ్ స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఏఈ నర్సింలు బుధవారం తెలిపారు. 132 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 1 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

గర్భిణులకు సామూహిక సీమంతం



సామూహిక సీమంతం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి పంచాయతీ పరిధి అంగన్‌వాడీ కేంద్రం–5లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి వివరించారు. గర్భిణులు రక్తహీనతతో బాధపడకూడదని ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తోందన్నారు. వైద్యుల సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం స్రవంతి, ఆశావర్కర్ మంజుల, ఉపాధ్యాయులు లలిత, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న బీఆర్‌ఎస్ నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): నర్సాపూర్ ఎమ్మెల్యేగా సునీతారెడ్డి విజయం సాధించడంతో బీఆర్‌ఎస్ నాయకులు తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శివ్వంపేట మండల కోఆప్షన్ మెంబర్ ఎండి నాయక్‌తో పాటు శివశంకర్‌రావు, వీరేష్, ఆంజనేయులు, వెంకటేష్, శ్రీకాంత్ బుధవారం తిరుపతి నుంచి మెట్ల మార్గం గుండా తిరుమల చేరుకొన్నారు. తలనీలాలు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.

ఉపసర్పంచ్ హత్య విచారకరం

మనోహరాబాద్(తూప్రాన్): భూవివాదంలో చిన్నశంకరంపేట మండలం శాలిపేట గ్రామంలో సోదరుడి చేతిలో ఉప సర్పంచ్ ఆంజనేయులు హత్యకు గురవడం బాధాకరమని జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేణుకుమార్ అన్నారు. బుధవారం మనోహరాబాద్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కుటుంబ కలహాలతో రెండు కుటుంబాలు వీధిన పడటం బాధాకరమన్నారు. మృతుడి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు అభినందన



ఎన్‌సీసీ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులు

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహించిన ఎన్‌సీసీ క్యాంపులో పాల్గొని వచ్చారు. బుధవారం వారిని ప్రిన్సిపాల్ అవనీష్‌రెడ్డి, లెక్చరర్లు అభినందించారు. ఈనెల 9 నుంచి 19 వరకు ఆదిలాబాద్‌లో జరిగిన ఎన్‌సీసీ క్యాంపులో కల్చరల్ యాక్టివిటీలో విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఎన్‌సీసీతో పాటు చదువులో కూడా రాణించాలన్నారు.

ట్రాక్టర్ ట్రాలీల చోరీ

కౌల్దారం(నర్సాపూర్): మండలంలోని ఎనగండ్ల, సదాశివనగరం గ్రామాల రైతుల ట్రాక్టర్ ట్రాలీలు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ సంఘటనలు బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రైతులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎనగండ్ల గ్రామానికి చెందిన లింగన్నగారి జనార్దన్ రెడ్డి తన ట్రాక్టర్ ట్రాలీని ఈనెల 14వ తేదీన ఇంటి వద్ద ఉంచాడు. తెల్లవారుజామున చూడగా కనిపించలేదు. అలాగే రంగంపేట మధిర గ్రామం సదాశివనగరానికి చెందిన సారా యాదయ్య కుమారుడు ఎనగండ్ల శివారు పొలంలో నారు వేసేందుకు ట్రాక్టర్‌ను తీసుకెళ్లాడు. ట్రాలీని అక్కడే వదిలి వచ్చాడు. ఇదే క్రమంలో ఆదివారం కుటుంబ కలహాల కారణంగా కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో యాదయ్య పొలానికి వెళ్లలేదు. బుధవారం వెళ్లి చూడగా ట్రాలీ కనిపించలేదు. బాధితులు పోలీసుకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాల తనిఖీ



ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న ఎంఈఓ

కౌల్దారం(నర్సాపూర్): మండలంలోని సంగాయిపేట ప్రాథమిక పాఠశాలను బుధవారం మండల విద్యాధికారి నీలకంఠం ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులకు ఒక్కరే ఉన్నాడు. పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్, బోధనపై ఆరా తీశారు. విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యేలా చూడడం, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఎంఈఓ వెంట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఉపేందర్ రెడ్డి, సీఆర్పీ రాములు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

చేగుంట(తూప్రాన్): మండలంలోని రెడ్డిపల్లి బూత్ అధ్యక్షుడు కాంతారావు కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు బుధవారం పరామర్శించారు. ఇటీవల కాంతారావు తల్లి భారతమ్మ మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న రఘునందన్‌రావు ఆయన కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. తాను ఓడినా, గెలిచినా కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. ఆయన వెంట బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు భూపాల్, ఎంపీటీసీ రవి, మాజీ ఎంపీటీసీ హరిశంకర్, మనోహర్, మాజీ ఎంపీపీ పాండు తదితరులు ఉన్నారు.



పరామర్శిస్తున్న రఘునందన్‌రావు

వాలీబాల్ పోటీలకు ఎంపిక



సందీప్‌తో పీఈటీ గోవర్ధన్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ అండ్‌ఆర్ కాలనీకి చెందిన క్రీడాకారుడు సందీప్ ఎంపికైనట్లు ఏటిగడ్డ కిష్టాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ పీఈటీ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఉస్మానియా యూనివర్సిటీ స్థాయి వాలీబాల్ సెలక్షన్స్‌లో అత్యుత్తమ ప్రతిభను కనబర్చిన సందీప్ సౌత్ జోన్ యూనివర్సిటీ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కర్ణాటకలోని బెల్గవిలో గల విశ్వేశ్వరయ్య టెక్నాలజీకల్ యూనివర్సిటీలో ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు జరిగే పోటీల్లో పాల్గొంటాడని పేర్కొన్నారు.

కృత్రిమ గర్భధారణతో మేలుజాతి పశువులు



భుజిరంపేటలో ఉచిత పశువైద్య శిబిరం

కౌడిపల్లి(నర్సాపూర్): కృత్రిమ గర్భధారణ ద్వారా మేలుజాతి పశుసంతతి వృద్ధి చెంది పశుపోషకులకు లాభం కలుగుతుందని మండల పశువైద్యాధికారి రాజు అన్నారు. బుధవారం మండలంలోని భుజిరంపేటలో విజయాడెయిరీ, పశు సంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృత్రిమ గర్భధారణతో మేలు జాతి దూడలు పుడతాయని, దీంతో పాలఉత్పత్తి అధికంగా ఉంటుందన్నారు. పాలను ప్రైవేటు డైరీలకు కాకుండా విజయాడెయిరీకి విక్రయిస్తే గిట్టుబాటు ధర పొందొచ్చన్నారు. రైతులు సాగుకు అనుబంధంగా పశుపోషణతో అదనపు ఆదాయం వస్తుందన్నారు. శిబిరంలో పశువులకు కృత్రిమ గర్భధారణ, నట్టల నివారణ, గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వనజ, ఎంపీటీసీ సత్తయ్య, ఉపసర్పంచ్ సాయిలు, నాయకులు రాజు, లింగం, కృష్ణ, చెన్నయ్య, పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి, విజయాడెయిరీ సూపర్‌వైజర్ భరత్, గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల పరామర్శ



బద్ర్యాతండాలో బుజ్జిబాయిని పరామర్శిస్తున్న ఆవుల రాజిరెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని బద్ర్యాతండా సర్పంచ్ బుజ్జిబాయి భర్త సర్వన్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. బుధవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి మృతుడి భార్య బుజ్జిబాయి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా ఆదివారం రాందాస్‌గూడలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ శ్రేణులు పరస్పర దాడిలో గాయపడిన కాంగ్రెస్ నాయకులు గాండ్ల వెంకయ్య, గాండ్ల యాదగిరిని పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, పార్టీ సీనియర్ నాయకుడు రవీందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు పండరి, సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ సుభాష్ రెడ్డి, దిలీప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రామదేవతల జాతరకు ఏర్పాట్లు



ముస్తాబైన శ్రీముత్యాలమ్మ, శ్రీపోచమ్మ ఆలయం

నర్సాపూర్ రూరల్: మండలంలోని అచ్చంపేటలో శ్రీ ముత్యాలమ్మ, శ్రీ నల్ల పోచమ్మ దేవతల జాతరకు గ్రామస్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 23 నుంచి 26 వరకు జరిగే జాతరకు గ్రామస్తులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు తరలిరానున్నారు. ఈనెల 23వ తేదీన గణపతి పూజ, మహాభిషేకం, 24న హారతి, పోచమ్మ కల్యాణం, బోనాల ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహిస్తారు. 25న అగ్ని గుండాలు, ఒగ్గు కథ, బండ్ల ఊరేగింపు, కోలాటం, 26న పోతరాజు గావు, బండ్ల ఊరేగింపు, కోలాటం, అక్కమ్మ వీధి భాగవతంతో జాతర ముగుస్తుందని గ్రామస్తుల తెలిపారు.

కరాటే పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



గెలుపొందిన విద్యార్థినులతో ఎంపీపీ స్వరూప

వెల్దుర్తి(తూప్రాన్): జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మండలంలోని మానెపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. మెదక్‌లో నిర్వహించిన టోర్నమెంట్‌లో 21 మంది పాల్గొన్నారు. అందులో ఎనిమిది గోల్డ్, ఎనిమిది సిల్వర్, ఐదు కాంస్య పతకాలతో పాటు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించారు. విద్యార్థులను బుధవారం ఎంపీపీ స్వరూప నరేందర్‌రెడ్డి అభినందించారు. విద్యార్థినులకు శిక్షణ ఇచ్చిన కోచ్ స్వప్నను సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థినుల ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవి, ఎస్‌ఎంసీ చైర్మన్ శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ పోతిరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగదారులకు ఇక్కట్లు



హెచ్‌పీ గ్యాస్ డీలర్ ఆఫీసు వద్ద క్యూలో నిలుచున్న వినియోగదారులు

నర్సాపూర్: వంట గ్యాస్ వినియోగదారులు ఈ కేవైసీ చేయించుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. గ్యాస్ డీలర్ ఆఫీసు వద్ద నిత్యం క్యూ కడుతున్నారు. బుధవారం కూడా వినియోగదారులు బారులుతీరారు. నర్సాపూర్‌లోని హెచ్‌పీ గ్యాస్ డీలర్ ఆఫీసులో ఈకేవైసీ నమోదు చేయించుకునేందుకు ఆయా గ్రామాల వినియోగదారులు తరలివచ్చారు. తమ వంతు వచ్చే వరకు నిరీక్షించారు.

దామోదరను విమర్శిస్తే సహించం

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిమ్మ రమేష్



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

టేక్మాల్(మెదక్): మంత్రి దామోదర రాజనర్సింహను విమర్శిస్తే సహించేదిలేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మరమేష్ బీఆర్‌ఎస్ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రమైన టేక్మాల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. దళితబంధు మంజూరుకు మాజీ ఎమ్మెల్యేకు, ఆయన సోదరుడికి భూమయ్య డబ్బులు ఇచ్చారన్నా ఆరోపణల్లో కాంగ్రెస్ పార్టీ జోక్యం ఉందనడం నిజం లేదన్నారు. భూమయ్యను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకోలేదన్నారు. దామోదర రాజనర్సింహపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోబోమన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా నిలపొద్దు

- మండల వైస్ ఎంపీపీ శరణ్యారెడ్డి
- తూప్రాన్‌లో మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంఈఓ బుచ్చానాయక్

తూప్రాన్: విద్యుత్ బకాయిల పేరుతో వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయొద్దని మండల వైస్ ఎంపీపీ శరణ్యారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ స్వప్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఏఈ వరహాలరావు మాట్లాడారు. మండలంలో విద్యుత్ బకాయిలు రూ.కోటికి పైగా ఉన్నట్లు తెలిపారు. బిల్లుల వసూలుకు వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. దీనికి వైస్ ఎంపీపీ స్పందిస్తూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, రైతులకు ఇబ్బందులు కలిగే చర్యలు తీసుకోవద్దని సూచించారు. ప్రస్తుత యాసంగి సీజన్ కావడంతో విద్యుత్ సరఫరా నిలిపివేసి రైతులకు నష్టం కలిగించే విధంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. రైతులకు నచ్చజెప్పి బిల్లులు వసూలు చేసుకోవాలన్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులు చేపడుతున్న పనులపై సమావేశంలో చర్చించారు. ఐకేపీ ఏపీఎం సమావేశానికి హాజరుకాకపోవడంపై ఎంపీడీఓ అరుంధతి అసహనం వ్యక్తం చేశారు. ఇకపై ప్రతీ సమావేశానికి అన్ని శాఖల అధికారులు సమగ్ర వివరణతో సమావేశానికి హాజరుకావాలన్నారు. సర్పంచ్‌లకు ఇదే చివరి సమావేశం కావడంతో వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరుంధతి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి నర్సయ్య, ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.